

హాలియా ప్రజా ఆశీర్వాద సభకు పోటెత్తిన జనం, ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

# ధరణి వద్దనెటోళ్లను.. బంగాళాఖాతంలో వేయాలి

**కాంగ్రెస్ చేతిలో రాజ్యం పడితే.. వైకుంఠం ఆటలో పెద్దపాము మింగినట్లే**

- భూముల క్రయ విక్రయాల్లో అక్రమాలను అరికట్టడానికే ధరణి పోర్టల్ తెచ్చినం
- దాని పుణ్యమనే రైతుబంధు, రైతుబీమా, వడ్ల పైసలు అకౌంట్లలో పడుతున్నయ్
- అధికారుల చుట్టూ తిరుగొద్దని.. లంచాలు ఇయ్యొద్దనే.. రైతుల బొటన వేలుకు అధికారం ఇచ్చాం
- మీకు అధికారాలు కట్టబెడితే.. కాంగ్రెసోళ్లు ఊడగొడ్తమంటున్నరు
- ఒక్క ఛాన్స్ అంటున్న కాంగ్రెస్ నేతలు 10, 11 ఛాన్స్‌లు ఇస్తే ప్రజలకోసం ఏంజేసిండ్రు.?
- కృష్ణా, గోదావరి నుంచి మంచి నీళ్లయినా తెచ్చియ్యగలిగిండ్రా.?
- బీఆర్ఎస్ కంటే ముందు ఎవడన్నా దళితుల గురించి ఆలోచించిండా.?
- రూ.200 పెన్షన్ మొఖాన కొట్టి మీ చావు మిమ్మల్ని చావమన్నరు
- ప్రజలందరికీ ఈ విషయం తెలిసేలా బీఆర్ఎస్ సైన్యం పనిచేయాలి
- 30వ తేదీలోగా ఏది నిజమనే సందేశం ప్రతి గడపకూ అందాలే
- మన గెలుపును ఎవడూ ఆపలేడు
- నాగార్జునసాగర్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

కాంగ్రెస్ పార్టీ వాళ్లు మాకు ఒక్క ఛాన్స్ ఇయ్యండి అంటున్నరు. వాళ్లకు ఒక్క ఛాన్స్ కాదు.. ప్రజలు ఇప్పటికే 10, 11 ఛాన్స్‌లు ఇచ్చిండ్రు. మరి ప్రజల కోసం ఏంజేసిండ్రు.? అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మంగళవారం నాగార్జునసాగర్ నియోజకవర్గం అభ్యర్థి నోముల భగత్‌కు మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. 50 ఏండ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కనీసం కృష్ణా, గోదావరి నదుల నుంచి మంచి నీళ్లయినా తెచ్చియ్యగలిగిండ్రా.? పైగా ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తరట. అసలు ధరణి పోర్టల్ ఎందుకు తెచ్చినం..? భూముల క్రయ విక్రయాల్లో అక్రమాలను అరికట్టడానికేగా..? రైతులు అధికారుల చుట్టూ తిరుగొద్దని., లంచాలు ఇయ్యొదనే.. రైతుల బొటన వేలుకు అధికారం ఇచ్చాం. ధరణి పుణ్యమనే ఇయ్యాల రైతుకు రైతు బంధు, రైతు బీమా, వడ్ల పైసలు వస్తున్నయి. ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తే ఇవన్నీ వస్తయా..? నేను రావాల్సిన వాటిపై మీకు అధికారాలు కట్టబెడితే కాంగ్రెసోళ్లు ఆ అధికారాలను ఊడగొడ్తమంటున్నరు. 24 గంటల కరెంటు తీసేసి.. 3 గంటలే ఇస్తరంట.. రైతుబంధు వేస్ట్ అని మాట్లాడుతున్నరు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంట.. రైతులకు 10హెచ్‌పీ మోటర్లు వీడి అయ్య కొనిస్తడా.? లంబాడీ బిడ్డలు తమ తండాలను పంచాయతీలు చేయాలంటే చేసిండ్రా..? చెయ్యలే.. ఇప్పుడు గిరిజనుల గురించి పెద్ద మాటలు చెప్తున్నరు. బీఆర్ఎస్ ప్రతి తండాలను పంచాయతీగా మార్చేసింది. దళితుల కోసం దళిత బంధు తెచ్చినం.. మరి బీఆర్ఎస్ కంటే ముందు ఎవడన్నా దళితుల గురించి ఆలోచించిండా.? నాడు రూ.200 పెన్షన్ మొఖాన కొట్టి మీ చావు మిమ్మల్ని చావమన్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2వేలు చేసినం.. రూ.5వేలకు పెంచుతామని ప్రకటించాం. దేశంలో ఎక్కడాలేని విధంగా 3కోట్ల మందికి కంటి పరీక్షలు చేసి 8 లక్షల మందికి కంటి అద్దాలు ఇచ్చినం. కాంగ్రెస్ గవర్నమెంట్ ఎప్పుడన్నా ఆలోచించిందా..? ఆనాడు దోపిడీకి గురైతే పట్టించుకున్నదా.? ఎన్నికలు కాంగనే మార్చి నుంచి రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యమే సప్లయ్ చేస్తమని ప్రకటించాం. ప్రజలందరికీ ఈ విషయం తెలిసేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలి. మీ గ్రామాల్లో చర్చ పెట్టాలి. 30వ తేదీలోగా ప్రతి గడపకూ ఏది నిజం. ఏది రాయి.. ఏది రత్నమో అనే సందేశం అందాలే. మన గెలుపును ఎవడూ ఆపలేడు.



నాగార్జునసాగర్ అభ్యర్థి భగత్



2014లో గెలిచిన మొదట్లో రెండేండ్లలో వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తానని ప్రకటన చేసిన. ఆనాడు జానారెడ్డి అపోజిషన్ లీడర్‌గా ఉండే. కేసీఆర్ రెండేండ్లలో కాదు.. నాలుగేండ్లలో కరెంట్ ఇచ్చినా.. నేను కాంగ్రెస్ కండువా తీసి గులాబీ కండువా కప్పుకొని మీ కార్యకర్తలా పనిచేస్తానని మాట్లాడిండు. కానీ ఏడాదిన్నరలోనే 24 గంటల కరెంటు ఇచ్చి నేను సక్సెస్ అయిన.. కానీ జానారెడ్డి మాట తప్పిండు. అలాంటోడికి మీరంతా గత ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పిండ్రు. ముఖ్యమంత్రి కల గంటున్న జానారెడ్డికి ఇప్పుడు కూడా అదేవిధంగా బుద్ధిచెప్పాలి.



రాష్ట్రాన్ని ముంచిందే.. కాంగ్రెస్, బీజేపీలు అప్పుడెట్లుండే.. తెలంగాణ.. ఇప్పుడెట్లైంది

# 10 హెచ్‌పీ మోటర్లకు పైసలు వాని తాత ఇస్తడా..?

**10 హెచ్‌పీ మోటర్లు గుంజుడు మొదలుపెడితే.. బోరు పొక్కలల్ల నీళ్లుంటయా..?**






ఇబ్రహీంపట్నం ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



- ఏ ముఖం పెట్టుకొని ఓట్లకోసం వస్తున్నరు
- మోటర్లకు మీటర్లు పెట్టకుంటే.. రూ.25వేల కోట్లు కట్‌చేసింది కేంద్రం
- బీజేపీ రాష్ట్రంలో ఒక్క మెడికల్ కాలేజీ, నవోదయ స్కూల్ పెట్టలే
- 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్.. కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలే..
- లంబాడీ, గిరిజన బిడ్డలను పట్టించుకోలే..
- ధరణి తీసేసి.. రైతుబంధు, రైతుబీమా నిలిపేస్తరట
- మూడు గంటల కరెంటు ఇస్తాం.. 10హెచ్‌పీ మోటర్లు కొనుక్కోవాలి
- కాంగ్రెస్ పాలసీ ఇదేనని ఓపెన్‌గా చెప్తున్నరు
- 100 శాతం మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- తలసరి ఆదాయం, విద్యుత్ రంగంలో నం.1 మనమే
- రైతుబంధును రూ.16వేలకు, పెన్షన్లు రూ.5వేలకు పెంచుతాం
- పాలకుర్తి, ఇబ్రహీంపట్నం ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

తెలంగాణ రాష్ట్రాన్ని ముంచిందే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అని సీఎం కేసీఆర్ అన్నారు. మంగళవారం పాలకుర్తి నియోజకవర్గం అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరై ప్రసంగించారు. ''బావులకాడ మీటర్లు పెట్టి.. బిల్లులు వసూలు చేయాలని ప్రధాని మోదీ బెదిరిస్తే.. చచ్చినా పెట్టనని చెప్పిన. సంవత్సరానికి రూ.5వేల కోట్లు.. ఇప్పటికే రూ.25వేల కోట్లు కట్ చేసిండు. అయినా నేను కాంప్రమైజ్ కాలేదు.. 24 గంటల కరెంటు ఆపలేదు.. దేశ వ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేస్తే.. మనకు ఒక్క కాలేజీ అన్న ఇవ్వొద్దా..? నవోదయ పాఠశాలలు పెట్టాలని 100 ఉత్తరాలు రాస్తే.. ఒక్కటికూడా ఇవ్వలే. మన ఎంపీలు పార్లమెంట్‌లో గడిబిడి చేసినా పట్టించుకోలే.. మరి బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి. రేపు బీజేపోడు వచ్చి ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతడు.'' '' 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఏపాటి అభివృద్ధి చేసింది. కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలే.. లంబాడీ, గిరిజన బిడ్డలను పట్టించుకోలే.. మళ్లీ ఇప్పుడొచ్చి ధరణి తీసేస్తాం.. రైతుబంధు నిలిపేస్తాం.. మూడు గంటలే కరెంటు ఇస్తాం.. మా పాలసీ ఇదే.. ఇంప్లీమెంట్ చేస్తామని ఓపెన్‌గా చెప్తున్నరు.'' రాష్ట్ర ప్రజలందరికీ బీఆర్ఎస్ పార్టీ చరిత్ర తెలుసు. రైతు స్థిరంగా ఉండాలని, వ్యవసాయ స్థిరీకరణ జరగాలని ఆలోచన చేసి ప్రపంచంలోనే ఎక్కడలేని విధంగా రైతుబంధు, రైతుబీమా పథకాలను పుట్టించింది బీఆర్ఎస్ ప్రభుత్వం. రానున్న రోజుల్లో రైతుబంధును రూ.16వేలకు పెంచుతున్నాం. ఇవాళ పెరిగిన భూముల ధరలకు.. ధరణి పోర్టల్ లేకుంటే వీఆర్వోలు చేసిన గోల్‌మాల్‌కు ఎన్ని హత్యలు అవుతుండే. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా 1018 రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టుకుని, వాటినే రెసిడెన్షియల్ కాలేజీలుగా మార్చుకున్నాం. తలసరి ఆదాయం, విద్యుత్ రంగంలో నాడు 19, 20వ స్థానంలో ఉన్న మనం నేడు మొదటి స్థానంలో నిలిచాం. ఇలా అనేక రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నాం. తెలంగాణ ఎక్కడి నుంచి ఎక్కడికి పోయింది..? ఎట్లున్న తెలంగాణ ఎట్లయ్యింది..? ఓటేసేటప్పుడు ఇవన్నీ ప్రజలు ఆలోచన చేయాలె.



పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి 24 గంటల కరెంటు అవసరం లేదు.. మూడు గంటలు ఇస్తే చాలు అంటున్నడు. కాంగ్రెస్ గెలిస్తే.. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలట. రైతులు 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోగలరా..? రాష్ట్రంలో మొత్తం 33 లక్షల మోటర్లు ఉన్నయ్. ఈ మోటర్లు ఎవరు కొని య్యాలే. ఎంత డబ్బు కావాలి. వీని తాత ఇస్తడా..? అయ్య ఇస్తడా..? ఎక్కడి నుంచి రావాలి.? 10 హెచ్‌పీ మోటర్లు గుంజుడు మొదలువెడితే బోరు పొక్కలల్ల నీళ్లుంటయా.? అందుకే ఎన్నికలు వచ్చినప్పుడు ఆగమాగమై ఓట్లేయ్యొద్దు. మేం ఆరు చందమామలు తెస్తం.. మేం ఏడు సూర్యుళ్లను తెస్తం అని తియ్యమాటలు చెప్పేటోళ్లను నమ్మి ఓటెయ్యొద్దు.

ఇబ్రహీంపట్నంలో రూ.700 కోట్లతో రోడ్లను విస్తరించాం.. అభివృద్ధి చేశాం. అద్భుతమైన రీజినల్ రింగ్‌రోడ్డు వస్తున్నది. దీంతో నియోజకవర్గం ముఖచిత్రమే మారిపోతది. కలెక్టరేట్ ఇక్కడే ఏర్పాటు చేసుకున్నాం. కోహెడలో పండ్ల మార్కెట్ వస్తున్నది. లక్ష మందికి ఉద్యోగాలు కల్పించే ఫాక్స్‌కాన్ పరిశ్రమ కూడా వస్తుంది. 600 ఎకరాల భూమి తీసిపెట్టినం. ఇబ్రహీంపట్నంలో మెడికల్ కాలేజీ ప్రారంభంకాబోతున్నది. ఎవడు ఆపినా ఆగవు. ఇప్పటికే అన్ని ఆఫీసులు తెచ్చి పెట్టుకున్నాం. నియోజకవర్గానికి మంచి భవిష్యత్తు ఉంది.



పాలకుర్తి ప్రజాఆశీర్వాద సభకు హాజరైన జనం, చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు